జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 11 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 8

# కొత్తగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవ కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 10, (ప్రజాజ్యోతి)** కొత్తగూడెం పట్టణంలోని పాత కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ప్రారంభించారు, అనంతరం కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన సదుపాయాలను సం బంధిత సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆధార్ సేవా కేంద్రం ద్వారా ప్రజలకు కొత్తగా ఆధార్ నమోదు చేయడం, ఆధార్ లోని వివరాల సవరణ, చిరునామా మార్పు, మొబైల్ నంబర్ అనుసంధానం తదితర ఆధార్ సంబంధిత సేవలను అందించనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా రోజుకు సుమారు 300 నుంచి 400 మంది వరకు ప్రజలకు

మిగతా 2 లో...



# వినాయకుడి విగ్రహాల్లో కెమికల్ కత్తీ

- నిమజ్జనం పేరుతో గోదావరికి విషాభిషేకం చేస్తున్న దందా..!
- కెమికల్ భూతంతో ప్రజల గొంతులో విషం నింపుతున్న రంగుల వినాయక విగ్రహాలు..!
- రంగుల పేరుతో ప్రజలకు మరణశాసనం...
- గోదావరి నీళ్లు తాగితే గుండెపోటు,పక్షవాతం తప్పదా..?
- మట్టి వద్దు... విషమే ముద్దు.! లాభం కోసం మణుగూరును క్యాన్సర్ కూపంగా మారుస్తున్న మాఫియా...
- కలెక్టర్ సార్ గోదావరిని,మనుషులను చంపేస్తున్నారు..!
- నిమజ్జనం పేరుతో గోదావరికి విషాభిషేకం చేస్తున్న దందా..!

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి/మణుగూరు, సెప్టెంబర్ 10. ప్రజాజ్యోతి...**
మణుగూరు మండలంలో వినాయక విగ్రహాల తయారీ పేరుతో గోదావరి నదిని విషతుల్యం చేస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం స్పష్టంగా బంకమట్టితోనే, ఎలాంటి రసాయనాలు లేకుండా విగ్రహాలు తయారు చేయాలని ఆదేశిస్తున్నా, మణుగూరులోని కొందరు విగ్రహ తయారీదారులు ఆ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. లాభార్జనే ధ్యేయంగా అత్యంత ప్రమాదకరమైన రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ను యథేచ్ఛగా వాడుతూ వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారని మేధావులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గోదావరంతా విషపురితం...**
పలు రకాల కెమికల్ రంగులతో తయారైన భారీ వినాయక విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనం చేయడం వల్ల గోదావరి జలాలు తీవ్రంగా

మిగతా 2 లో...



# సివిల్ సప్లైస్ లో 'అవినీతి తిమింగలం'?

- ఉమ్మడి ఖమ్మం జిల్లానే అడ్డాగా అక్రమ సంపాదన?
- పదేళ్ల సర్వీసులో కోట్ల ఆస్తులా..? విచారణకు సిద్ధమా?
- ఖమ్మం–కొత్తగూడెం–అశ్వరావుపేట కేంద్రంగా ఆరోపణలు

**అశ్వరావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 10**
సివిల్ సప్లైస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిపై తీవ్రస్థాయిలో అవినీతి, అక్రమ ఆస్తుల ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు ఉద్యోగి ఎక్కడ విధులు నిర్వహించినా అక్కడ భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. సదరు ఉద్యోగికి సుమారు రూ. 10 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు ఉన్నాయనే సమాచారం వెలువడుతున్న నేపథ్యంలో ఈ ఆస్తుల మూలాలు ఏమిటన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఖమ్మం, కొత్తగూడెం, అశ్వరావుపేట ప్రాంతాల్లో ఆస్తులు కూడబెట్టినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

8 లో...

## రైస్ మిల్లులపై వరుస సోదాలు..
# లేవీ ధాన్యంపై అనుమానాలు

- సివిల్ సప్లై అధికారుల అస్మార్థతా?
- విజిలెన్స్ అధికారుల సమర్థతా?
- మండలంలో లేవిబియ్యం అక్రమ దందా ?గుట్టురట్టు చేసిన
- జిల్లా విజిలెన్స్ అధికారులు
- ప్రభుత్వ ధాన్యం అక్రమ మార్గంలో తరలిస్తున్నారనే సమాచారంతో అధికారుల తనిఖీలు..
- తూతూమంత్రపు సోదాలపై కూడా ఆరోపణలు



**అశ్వాపురం, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి** అశ్వాపురం మండల పరిధిలోని రైస్ మిల్లులపై అధికారుల సోదాలు రోజురోజుకూ పెరుగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ లేవీ విధానంలో భాగంగా రైస్ మిల్లులకు

మిగతా 2 లో...

# భూ రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- జిల్లా కలెక్టర్ అంకిత్
- సీతాయిగూడెంలో భూ రీ-సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 10, (ప్రజాజ్యోతి)** చంద్రుగొండ మండలం సీతాయిగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ–సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, సర్వే ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామ పరిధిలో మొత్తం 1,823 ఎకరాలకు భూ రీ–సర్వే నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుతం గ్రామ సరిహద్దుల నిర్ధారణతో పాటు భూముల వివరాల పరిశీలన కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇటీవల గ్రామ సభను కూడా నిర్వహించామని, అన్ని శాఖల సమన్వయంతో రీ–సర్వే ప్రక్రియను

మిగతా 2 లో...

## భూ రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం




(మొదటి పేజీ తరువాయి...)

చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో సుమారు 200 వరకు నివాసాలు ఉన్నట్లు అధికారులు వివరించగా, భూమి ఉన్నప్పటికీ పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు, పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ భూమి వివరాలు సరిపోని వారు, రికార్డుల్లో భూముల వివరాలు నమోదు కాని సందర్భాలు కూడా ఉన్నట్లు తెలిపారు. భూ రీ-సర్వే పూర్తయిన అనంతరం భూముల వాస్తవ పరిస్థితిని గుర్తించి, రికార్డుల్లో అవసరమైన సవరణలు చేయడంతో పాటు అర్హులైన భూహక్కుదారులకు పాస్‌బుక్‌లు పొందే అవకాశం కలుగుతుందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ గ్రామంలోని గిరిజనులతో నేరుగా మాట్లాడి భూ రీ-సర్వే వల్ల వారికి కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే ప్రక్రియ గిరిజన రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్‌కు తెలిపారు. గతంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా భూములకు సంబంధించిన రికార్డుల సవరణలు, ఇతర ప్రక్రియలు పూర్తి చేసుకోలేకపోయిన వారికి ప్రస్తుత రీ-సర్వే ప్రక్రియ ద్వారా మేలు జరుగుతుందని చెప్పారు. పాత భూ రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఉన్న భూములను గుర్తించడం ద్వారా తమ భూ హక్కులకు మరింత స్పష్టత లభిస్తుందని గిరిజనులు పేర్కొన్నారు. గ్రామ పరిధిలో అటవీ భూములు కూడా గణనీయంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెద్దగూడెం ఫారెస్ట్ బ్లాక్ పరిధిలో సుమారు 5,000 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉండగా, సీతాయిగూడెం గ్రామ పరిధిలో సుమారు 700 నుంచి 800 ఎకరాల వరకు అటవీ భూమి ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రాంతం రామవరం, చంద్రుగొండ తదితర అటవీ రేంజ్‌ల పరిధిలో ఉన్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాత భూ రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించారు. సుమారు 1920ల నాటి పాత మ్యాప్‌లు, రికార్డులను పరిశీలిస్తూ అప్పటి భూముల హద్దులు, చెట్లు, కుంటలు, చెరువులు, తోటలు తదితర వివరాలను నమోదు చేసిన విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో ఏర్పాటు చేసిన భూ హద్దు రాళ్లు ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కనిపించడం లేదని అధికారులు వివరించగా, భూ రీ-సర్వేలో హద్దులను స్పష్టంగా నిర్ధారించి, భవిష్యత్‌లో కూడా సులభంగా గుర్తించే విధంగా శాశ్వత హద్దు గుర్తులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. భూ రీ-సర్వే ద్వారా భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలు తదితర అంశాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూమి ఉండి రికార్డుల్లో నమోదు కాకపోవడం, పాస్‌బుక్ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో భూమి వివరాలు లేకపోవడం వంటి సమస్యలను గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు కూడా రికార్డుల్లో తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రీ-సర్వే ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, సర్వే అధికారులు, అటవి శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడి విగ్రహాల్లో కెమికల్ కల్తీ



(మొదటి పేజీ తరువాయి...)

కలుషితమవుతున్నాయి. నిమజ్జనం అనంతరం ఆ విగ్రహాలకు పూసిన రంగుల్లోని సీసం, పాదరసం, క్రోమియం, కాడ్మియం వంటి అత్యంత ప్రమాదకరమైన విష రసాయనాలు నీటిలో పూర్తిగా కలిసిపోయి నదిని విషపూరితం గా మారుస్తున్నాయి. నీరు పైకి స్వచ్ఛంగా కనిపిస్తున్నా లోపల మాత్రం విషం నిండి పోతుంది. జలచరాలు మృత్యువాత పడుతున్నా నీటి పరిస్థితి దయనీయంగా మారుతోంది. అదే గోదావరి నీటిని తాగుతూ, అదే నీటిపై ఆధారపడి జీవిస్తున్న మణుగూరు ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని వైద్యులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషపూరిత నీటి వల్ల గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ ఫెయిల్యూర్, ఉబ్బసం, చర్మ వ్యాధులు, నరాల బలహీనత, రేచీకటి వంటి దీర్ఘకాలిక రోగాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. లాభం కోసం కొందరు చేస్తున్న ఈ పని ముమ్మాటికీ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని, దీనిని ఏమాత్రం ఉపేక్షించకూడదని ప్రముఖులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ముమ్మాటికీ అధికారుల నిర్లక్షమే...**

"రంగు విగ్రహాలు వద్దు...మట్టి విగ్రహాలే ముద్దు" అని ప్రభుత్వం పేపర్లలో, టీవీల్లో గొప్పగా ప్రచారం చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అది కేవలం నినాదంగానే మిగిలిపోయిందని స్థానికులు మండిపడుతున్నారు. మణుగూరులో విగ్రహ తయారీ కేంద్రాల వద్దకు వచ్చి తనిఖీ చేసే నాథుడే లేడని, అధికారుల నిర్లక్ష్యమే ఈ దందాకు ఊతమిస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో బహిరంగంగా చెలగాటమాడుతున్న ఈ విగ్రహ తయారీదారులపై సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఇంకా ఎంతమంది అనారోగ్యం పాలైతే చర్యలు తీసుకుంటారని ప్రజలు నిలదీస్తున్నారు.

**ప్రతి విగ్రహ తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయాలి...**

ఈ విషపూరిత పరిస్థితిని చూసి ఇక సహించలేని స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు వెంటనే అధికార యంత్రాంగం రంగంలోకి దిగాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా మణుగూరు మండలంలోని ప్రతి విగ్రహ తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయాలని కోరుతున్నారు. ఎక్కడెక్కడ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్రమాదకర రసాయన రంగులు వాడుతున్నారో గుర్తించి ఆ కేంద్రాలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కెమికల్ రంగులు వాడుతూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో కేవలం బంకమట్టితో తయారు చేసిన పర్యావరణ హిత విగ్రహాలను మాత్రమే అనుమతించాలని వేడుకుంటున్నారు. అంతేకాకుండా ఇప్పటికే కలుషితమైన గోదావరి నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌లో పరీక్షించి, కలుషిత స్థాయి ఎంత ఉందో ప్రజల ముందు బహిర్గతం చేయాలని, గోదావరిని కాపాడటానికి శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రైస్ మిల్లులపై వరుస సోదాలు.. లేవీ ధాన్యంపై అనుమానాలు

(మొదటి పేజీ తరువాయి...)

అందుతున్న ధాన్యాన్ని కొందరు అక్రమ మార్గాల్లో విక్రయిస్తున్నారనే సమాచారంతో సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మండలంలోని పలు రైస్ మిల్లుల వద్ద అధికారుల తనిఖీలు, ధాన్యం నిల్వల పరిశీలనపై స్థానికంగా చర్చ జరుగుతోంది. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిన అనంతరం నిర్దేశిత నిబంధనల ప్రకారం రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించడం, దానికి అనుగుణంగా బియ్యాన్ని ప్రభుత్వానికి లేవీ రూపంలో అందించడం జరుగుతుంది. అయితే ఈ ప్రక్రియలో ఎక్కడైనా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయా? ప్రభుత్వానికి చేరాల్సిన ధాన్యం లేదా బియ్యం పక్కదారి పడుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కొన్ని రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలు, రికార్డులు, లెక్కలు తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. మిల్లుల్లో ఉన్న ధాన్యం నిల్వలకు సంబంధించిన రికార్డులు, కొనుగోలు వివరాలు, ప్రభుత్వ కేటాయింపులు, మిల్లింగ్ వివరాలు, లేవీ బియ్యం సమర్పణ తదితర అంశాలపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సోదాలు పూర్తి స్థాయిలో జరగాలనే డిమాండ్ మరోవైపు కొంతమంది సంబంధిత అధికారులు రైస్ మిల్లుల్లో నిర్వహిస్తున్న తనిఖీలు కేవలం తూతూమంత్రంగా సాగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సోదాల సమయంలో ప్రతి మిల్లులోని ధాన్యం నిల్వలను పూర్తిస్థాయిలో పరిశీలించి, రికార్డులతో సరిపోల్చాల్సి ఉండగా, అలా జరుగుతున్నదా లేదా అనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ధాన్యం విషయంలో అక్రమాలకు పాల్పడితే రైతులకు, ప్రభుత్వానికి నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పారదర్శకంగా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం తనిఖీల పేరుతో మిల్లులను సందర్శించడం కాకుండా, స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు రికార్డులు, మిల్లింగ్ వివరాలు, రవాణా పత్రాలు, లేవీ బియ్యం పంపిణీ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలి రైస్ మిల్లులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిజంగా ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టినట్లు, అక్రమంగా విక్రయించినట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మిల్లులపై మాత్రమే కాకుండా మండలంలోని అన్ని రైస్ మిల్లుల లేవీ ప్రక్రియను ఒకే విధంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారుల తనిఖీలు పూర్తిగా పారదర్శకంగా జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, రైతుల ప్రయోజనాలతో పాటు ప్రభుత్వ ధాన్యం కూడా రక్షించబడుతుందని వారు పేర్కొంటున్నారు. అయితే రైస్ మిల్లులపై వచ్చిన ఆరోపణలు, సోదాల సమయంలో బయటపడిన అంశాలపై సంబంధిత శాఖ అధికారుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెల్లడిస్తారా, లేక సోదాలు కేవలం నామమాత్రంగానే కొనసాగుతాయా అన్నది వేచి చూడాల్సి ఉంది.

## కొత్తగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవ కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్

(మొదటి పేజీ తరువాయి...)

ఆధార్ సేవలు అందించే సామర్థ్యం ఉందని తెలిపారు, ఆధార్ సేవలు పొందేందుకు ప్రజలకు ఆన్‌లైన్‌లో ముందస్తు టోకెన్ బుకింగ్ సదుపాయం కూడా అందుబాటులో ఉం దని అధికారులు తెలిపారు. ప్రజలు ముందుగానే ఆన్ లైన్‌లో అపాయింట్‌మెంట్ తీసుకుని నిర్ణీత సమయంలో ఆధార్ సేవా కేంద్రానికి రావడం ద్వారా తమ సమయాన్ని ఆదా చేసుకోవచ్చని సూచించారు. ఆన్‌లైన్ టోకెన్ బుకింగ్ కోసం యు ఐ డి ఏ I అధికారిక అపాయింట్ మెంట్ వెబ్‌సైట్‌ను https://appointments.uidai.gov.in/bookappointment.aspx ద్వారా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ అత్యంత ముఖ్యమైన గుర్తింపు పత్రంగా మారిందని, అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు, బ్యాంకింగ్ తదితర అవసరాలకు ఆధార్ అవసరమవుతున్న నేపథ్యంలో ప్రజలకు ఆధార్ సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కొత్తగూడెంలో నూతన ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి రావడం ద్వారా జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఆధార్ సేవల కోసం జిల్లా ప్రజలు హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కొత్తగూడెంలోనే సేవలు పొందే అవకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు . గతంలో ఆధార్‌కు సంబంధించిన వివిధ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం వల్ల ప్రజలకు ప్రయాణ సమయం, ఖర్చులు పెరిగేవని, ప్రస్తుతం స్థానికంగానే ఆధార్ సేవలు అందుబాటులోకి రావడంతో ఆ ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ఆధార్‌కు సంబంధించిన సేవల కోసం ప్రజలు



ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర యు ఐ డి ఏ ఐ రీజినల్ కార్యాలయం, హైదరాబాద్ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్ చంద్ర, బి ఎల్ ఎస్ జాతీయ సర్వీస్ లిమిటెడ్ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం ఆధార్ సేవా కేంద్రం ఆపరేషనల్ మేనేజర్ వంశీ, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వర రావు , టి ఎస్ టి ఎస్ మేనేజర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యచరణను అమలు చేయాలి

- 42 బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా చర్యలు వేగవంతం చేయాలి
- 2026 జనవరి నుంచి నేటి వరకు 349 ప్రమాదాలు 164 మంది మృతి





**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, ప్రమాదాల నివారణను అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు, ఐడీఓసీ కార్యాలయం అదనపు కలెక్టర్ ఛాంబర్ నందు గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాలు, వాటికి గల కారణాలు, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 42 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గతంలో జరిగిన ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, అవసరమైన ఇంజినీరింగ్, రహదారి భద్రతా చర్యలను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని సూచించారు. జిల్లాలో జనవరి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు మొత్తం 349 రోడ్డు ప్రమాదాలు నమోదై 164 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ఒక్క ఆగస్టు నెలలోనే 36 రోడ్డు ప్రమాదాలు జరగగా 14 మంది మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదాల సంఖ్య, తీవ్రతను తగ్గించే విధంగా ప్రమాదాలకు గల ప్రధాన కారణాలను గుర్తించి, వాటి నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. రహదారులపై పశువుల సంచారం, ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాలకు కారణమవుతున్నందున పశువులను రహదారులపైకి వదిలే యజమానులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అతివేగం, మైనర్లకు వాహనాలు అప్పగించడం, హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగించకపోవడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలతో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గుర్తించిన 42 బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరికలు, సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రహదారి మార్కింగ్ తదితర భద్రతా ఏర్పాట్లను పూర్తి స్థాయిలో చేపట్టాలని, రహదారులపై ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చివేయడంతో పాటు, రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ఎప్పటికప్పుడు తొలగించి వాహనదారులకు స్పష్టమైన దృశ్యమానత కల్పించాలని సూచించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు, ఈ సమావేశంలో జిల్లా రవాణా అధికారి వి వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి అనూష, జిల్లా ఇంటర్మీడియట్ శాఖాధికారి వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్ కుమార్, ఐఆర్‌ఏడీ జిల్లా మేనేజర్ బాలాజీ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూమి, భుక్తి కోసం చిట్యాల ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబరు 10,(ప్రజా జ్యోతి)** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి, భుక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మ మహిళా శక్తికి, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచారని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గురు వారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం, త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. భూమి, భుక్తి కోసం ఆమె చూపిన పోరాటపటిమ నేటికీ ప్రజలకు స్ఫూర్తినిస్తోందని తెలిపారు. ముఖ్యంగా యువత, మహిళలు ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక అభివృద్ధికి, సమానత్వం కోసం కృషి చేయాలని సూచించారు.చాకలి ఐలమ్మ జీవితం స్త్రీ సాధికారతకు, సామాజిక సమానత్వానికి మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు ,ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, డిఆర్ఓ పద్మావతి, కలెక్టరేట్ ఏవో అనంత రామకృష్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి ,జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి అధికారి ఎ. శ్రీలత, బీసీ సంఘాల నాయకులునేరెళ్ల రమేష్, అజిత్ కుమార్, రెచర్ల సర్వేశ్వర రావు, కణతాల వసంత రావు, పోగుల లక్ష్మీ నారాయణ, చిటికెన ముసలయ్య, ముదిగొండ రాంబాబు, కొదుమురి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు వ్యవసాయ సాగుపై శిక్షణ

**చర్ల, సెప్టెంబర్ 10 :(ప్రజా జ్యోతి):** చర్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ కార్యక్రమం ద్వారా రైతులకు వివిధ వ్యవసాయ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భద్రాచలం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి. సుధాకర్‌రావు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిని నేరుగా విత్తే పద్ధతి, సన్న రకాల వరి సాగు, భూసార పరీక్షల ప్రాధాన్యత, ఆయిల్‌పామ్ సాగు విధానాలు, ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వరికి బదులుగా ఆరుతడి పంటల సాగు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించే పంటల ఎంపికపై రైతులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవితేజరెడ్డి, మైరాడా అగ్రానమిస్ట్ షణ్ముఖ సాయి, వ్యవసాయ విస్తరణ అధికారి అఫ్రిద్, ఐటీసీ సోషల్ మొబిలైజర్ నవీన్, నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



# కేటీపీఎస్ 5-6 దశల ను సందర్శించిన శ్రీలంక సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి తురై రాజ

- తురై రాజుకు ఘనంగా స్వాగతం పలికిన కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్లు





**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 10 ,(ప్రజా జ్యోతి)** పాల్వంచ కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారాలను శ్రీలంక సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి తురయ్ రాజా గురువారం సందర్శించారు, తురై రాజు అధికారిక కార్యక్రమం కోసం ఢిల్లీ వచ్చిన ఆయనపాల్వంచ లోని ఒక ప్రైవేట్ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా కేటీపీఎస్ –5&6 దశలలో నీ కోల్ ప్లాంట్ ,బాయిలర్, టర్బైన్, యు సి బి, కూలింగ్ టవర్ తదితర విభాగాలను ఆయన సందర్శించారు, మొదటిసారిగా పాల్వంచకు వచ్చిన న్యాయమూర్తి రాజును కేటీపీఎస్ 5, 6 దశల చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర రావు ఘనంగా స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు, న్యాయమూర్తి వెంట డి ఈ సిహెచ్ పి. మధుబాబు, ఏ డి ఈ లు లు సమీర్ , బి రాధా కృష్ణ జే ఏ ఓ లు శ్రీనివాస్ రెడ్డి , వై టి ఎం కె రాజు (నానీ) పలువురు కేటీపీఎస్ అధికారులు ఉన్నారు

# విద్యార్థుల ధ్రువపత్రాల జాప్యాన్ని వెంటనే పరిష్కరించాలి

- బీజేపీ ఎస్టీ మోర్చా, యువమోర్చా నాయకులు భద్రాచలం తాసిల్దార్ కు వినతి



**భద్రాచలం /సెప్టెంబర్ 10,(ప్రజా జ్యోతి)** ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, పీజీ ప్రవేశాల ప్రక్రియలు జరుగుతున్న సందర్భంగా విద్యార్థులకు అవసరమైన కుల, సమగ్ర, ఆదాయ, నివాస ధ్రువపత్రాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే పరిష్కరించాలని కోరుతూ భద్రాచలం బీజేపీ ఎస్టీ మోర్చా, యువమోర్చా ఆధ్వర్యంలో భద్రాచలం తహసీల్దార్ వై రవికుమార్ కు గురువారం వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్‌మాట్లాడుతూ, మీ సేవ ద్వారా దరఖాస్తు చేసిన అనంతరం సంబంధిత సిబ్బంది పరిశీలన, ఆర్ఐ ధృవీకరణ, తహసీల్దార్ స్థాయి ఆమోదం వంటి వివిధ దశల్లో సమన్వయం లోపించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగ, విద్యా ప్రవేశాల గడువులు సమీపిస్తున్న నేపథ్యంలో పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేకంగా సమీక్షించి, అత్యవసర దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి ధ్రువపత్రాలను త్వరితగతిన జారీ చేయాలని కోరారు. అలాగే విద్యార్థులు తమ ధ్రువపత్రాల దరఖాస్తు స్థితిని సులభంగా తెలుసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.అదేవిధంగా, ఉద్యోగం లేదా విద్యా ప్రవేశానికి గడువు ఉన్న విద్యార్థులు తమ పెండింగ్ ధ్రువపత్రాల వివరాలను బీజేపీ సహాయ కేంద్రానికి పంపితే, వారి దరఖాస్తు స్థితిని సంబంధిత అధికారుల వద్ద తెలుసుకుని, అవసరమైన మేరకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫాలోఅప్ చేస్తామని కుంజా సంతోష్ తెలిపారు. ఎలాంటి సహాయం కావాలన్నావాట్సాప్ సహాయ కేంద్రం: 9866060034విద్యార్థులు మీ సేవ దరఖాస్తు సంఖ్య, ధ్రువపత్రం పేరు, దరఖాస్తు తేదీ, ఉద్యోగం /ప్రవేశానికి సంబంధించిన గడువు వివరాలను పై నంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యువమోర్చా నాయకులు ములిశెట్టి నిఖిల్, అన్నెం సాయి లక్ష్మణ్, కిలారు అంజి, గంగులకుర్తి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

చర్ల, సెప్టెంబర్ 10 :(ప్రజా జ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గురువారం చర్ల మండల కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఎం చర్ల మండల కార్యదర్శి మచ్చా రామారావు మాట్లాడుతూ భూస్వాములు, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా పేదలు, రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న దోపిడీపై చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని అన్నారు. తన భూమి హక్కు కోసం ప్రారంభించిన ఆమె పోరాటం అనంతరం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు.చాకలి ఐలమ్మ పేదలు, మహిళలు, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని తెలిపారు. భయపెట్టినా, బెదిరించినా వెనక్కి తగ్గకుండా అన్యాయాన్ని ఎదిరించిన ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. ప్రస్తుత కాలంలో పేదలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు, ఐద్వా మండల కార్యదర్శి పొదుపుగంటి సమ్మక్క, నవీన్, వరదల వరలక్ష్మి , సూరమ్మ పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ శ్రీ గణేష్ ఆటో యూనియన్ సీనియర్ నాయకులు జి. గురునాథం, దొంతు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ధనసరి సంపత్, ఉప కార్యదర్శి చల్ల అశోక్, యూత్ ప్రెసిడెంట్ కంచర్ల సతీష్, జంజర్ల తులసిరాం, బన్నీ, పవన్, వాసు, సాయి, మున్నా ఖాన్, పోతురాజు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



# టీజీ జెఏసి చలో హైదరాబాద్ వాయిదా

- ఈనెల 18న సర్కార్ తో కీలక చర్చలు
- విలేకరుల సమావే శంలో జేఏసీ చైర్మన్ అమరనేని రామారావు



**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 10, (ప్రజా జ్యోతి)** ప్రభుత్వం లిఖితపూర్వక హామీ మేరకే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జేఏసీ చైర్మన్ అమరనేని రామారావు తెలిపారు, గురువారం స్థానిక టీఎస్ యుటిఎఫ్ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ నిర్ణయం మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇతర ఉన్నతాధికారులతో జరిగిన చర్చల అనంతరం ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక హామీ మేరకు పిఆర్సి నివేదికను త్వరితగతిన పూర్తిచేసి ప్రభుత్వానికి సమర్పించాలని, పిఆర్సి కమిషన్ చైర్మన్ శివశంకర్కు లేఖ రాసినట్లు తెలిపారు, వచ్చే దసరా నుంచి పి ఆర్ సి ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, అనంతరం జేఏసీ జిల్లా కన్వీనర్ సంఘం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వంతో ఈ నెల 18న మనీదశ చర్చలు జరపాలని నిర్ణయించడం సంతోషదాయకమన్నారు, స్నేహపూర్వక వాతావరణంలో ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు ,రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ఉద్యోగుల డిఏలు బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు, కనీసం మూడు డిఏలను తక్షణమే చెల్లించాలని, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం నెలకు 2 వేల కోట్లు కేటాయించాలని కోరారు, రాష్ట్రంలో సుమారు 11 వేల కోట్లు మేర బిల్లులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు, అనంతరం పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షుడు నరసయ్య మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు సిపిఎస్ రద్దు పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు ,సిబిఎస్ అంశంపై పిఆర్సి నిపుణుల ఉన్నతాధికారులు ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం వెల్లడించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు ,ఈ కమిటీ ద్వారా ఉద్యోగులకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు, ఈనెల 18న జరిగే చర్చల్లో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ పై కూడా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు, అదేవిధంగా టీఎన్జీవోఎస్ జిల్లా కార్యదర్శి భార్గవ చైతన్య మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల నిరసనల తీవ్రతను ప్రభుత్వం గుర్తించి జిఏడి ద్వారా లిఖితపూర్వక హామీ ఇవ్వడంతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్నివాయిదా వేసినట్లు తెలిపారు, 18న జరిగే చర్చల్లో ఉద్యోగులకు స్పష్టమైన ప్రయోజనం కలిగే నిర్ణయాలు తీసుకోకపోతే జీవో జారీ చేయకపోతే 19 జరిగే జేఏసీ విస్తృతస్థాయి సమావేశంలో తదుపరి కార్యచరణ పై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు ఈ విషయంలో ఉద్యోగులు ఆందోళన చెందనవసరం లేదని కోరారు.

## పోలీసుల తనిఖీలు ముమ్మరం

- అంబేద్కర్ సెంటర్లో వాహనాల చెకింగ్
- రూల్స్ పాటించని వాహనదారులకు జరిమానాలు
- హెల్మెట్ లేకుంటే చర్యలు తప్పవు
- అనుమానాస్పద వాహనాలపై నిఘా



**మణుగూరు క్రైమ్, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి** మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో గురువారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, నేరాల నియంత్రణకు చేపట్టిన ఈ తనిఖీల్లో పలు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి పత్రాలను పోలీసులు తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి, సరైన పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

## అక్రమ తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు

- సర్పంచ్ పూజారి సామ్రాజ్యం



**చర్ల, సెప్టెంబర్ 10 :(ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలోని స్మశాన వాటికకు కేటాయించిన స్థలంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న ఘటనపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్మశాన వాటిక స్థలాన్ని పరిరక్షించాల్సిన అధికారులు తక్షణమే స్పందించి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ నేపథ్యంలో చర్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం మండల అధికారులు, గ్రామ పెద్దలతో కలిసి స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. భవిష్యత్తులో స్మశాన వాటిక స్థలంలో ఆక్రమణలు, అక్రమ తవ్వకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హెచ్చరించారు.రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి స్మశాన వాటికకు కేటాయించిన స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను పంచాయతీకి అందజేయాలని సర్పంచ్ కోరారు. అధికారిక పత్రాలు అందిన వెంటనే పంచాయతీ ద్వారా నిధులు మంజూరు చేయించి స్మశాన వాటిక పరిసర ప్రాంతాల్లో చెట్లను, చెత్తాచెదారాన్ని తొలగించి అభివృద్ధి చేస్తామని తెలిపారు.

## ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు

**చర్ల, సెప్టెంబర్ 10:(ప్రజా జ్యోతి ):** ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మామిడిగూడెం సబ్ సెంటర్లో తల్లిదండ్రులు, పిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలను తల్లిదండ్రులు అధిక ఒత్తిడికి గురిచేయకుండా మానసిక ధైర్యం, జీవన నైపుణ్యాలను పెంపొందించేలా ప్రోత్సహించాలని పిల్లలతో కొంత సమయం గడపాలని, మొబైల్ ఫోన్కు దూరంగా ఉంచాలని అవగాహన కల్పించారు. కష్టనష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని తెలిపారు. ఉచిత మానసిక సహాయం కోసం టెలి-మానస్ టోల్‌ఫ్రీ నంబర్లు 14416, 1800-891-4416కు 24 గంటలు సంప్రదించవచ్చని కార్యక్రమంలో వివరించారు.



## నకిలీ ఎరువులపై చర్యలు తీసుకోవాలి

- ఇరప. రాజు దొర డిమాండ్



**చర్ల, సెప్టెంబర్ 10:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో నకిలీ ఎరువుల దందా జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సమ గ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ హక్కు ల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు దొర డిమాం డ్ చేశారు. నకిలీ లేదా నాణ్యత లేని ఎరువుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే ప్ర మా దం ఉందని అన్నారు. ఏజెన్సీ ప్రాం త రై తుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ వ్యాపారాలు నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.చర్ల మండలంలోని ఎరువుల దుకాణాల్లో ఎరువుల నాణ్య త, లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, కొనుగోలు-విక్రయాల రికార్డులను అధికారులు తక్షణమే తనిఖీ చేయాలని కోరారు. నకిలీ ఎరువులు విక్రయిస్తున్నట్లు నిర్ధారణ అయితే సంబంధిత దుకాణాలను వెంటనే సీజ్ చేసి, బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతుల ప్రయోజనాలను కాపాడ టం ప్రభుత్వ బాధ్యత అని నకిలీ ఎరువుల దందాకు అడ్డుకట్ట వేయకపోతే ప్రజల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని .రాజు దొర హెచ్చరించారు.

## అనారోగ్య బాధితులకు ఆర్థిక చేయూత



**బూర్గంపహాడ్, సెప్టెంబరు 10 (ప్రజా జ్యోతి ):** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సారపాకకు చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా ) ఆర్థికసాయం అందించింది. బూర్గంపహాడ్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరు బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేల ఆర్థికసా యం అందజేశారు.కాగా బూర్గంపహాడ్కు చెందిన బీమయ్య కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్నారు. అదేవిధంగా ఆటోడ్రైవర్ జానీ కూడా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి పరిస్థితిని స్థానికులు మేవా వెల్ఫేర్ సొసైటీ దృష్టికి తీసుకెళ్లారు.దీంతో స్పందించిన మేవా ప్రతినిధులు బాధితుల కుటుంబాల పరిస్థితిని తెలుసుకుని, వైద్య ఖర్చులకు తమవంతు సహాయంగా ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు తమ సంస్థ తరపున వీలైనంత సహాయం అందిస్తామని మేవా ప్రతినిధులు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడం ద్వారా మానవతా విలువలను చాటుతున్న మేవా సేవలను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో మేవా అధ్యక్షుడు మహ్మద్ ముస్తఫా, సోహెల్ పాషా, గ్రామపెద్ద దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీలకు శ్రీకారం

- విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలంలోని మొరంపల్లి బంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కుదుముల జమాలారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలకు కూడా విద్యార్థులు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన, జట్టుగా పనిచేసే తత్వం అలవడుతుందని తెలిపారు.విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి తగిన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. క్రీడా మైదానంలో విద్యార్థుల సందడి నెలకొంది. విజయం సాధించేందుకు క్రీడాకారులు పోటాపోటీగా తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు.కార్యక్రమంలో ఎంఈవో యదు సింహరాజు, సర్పంచ్ బొర్రా సుభద్ర, ఉపసర్పంచ్ పొక్కుల రవి, పంచాయతీ కార్యదర్శి భవాని, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, పీఈటీలు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు కైపు రామచంద్రారెడ్డి, గాదె నర్సిరెడ్డి పాల్గొన్నారు.

## మదర్ తెరిసా యూత్ వినాయక లోగో ఆవిష్కరణ



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 10, (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల మదర్ తెరిసా యూత్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలకు సంబంధించిన లోగోను గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. యూత్ సభ్యులు, కమిటీ సభ్యులు కలిసి లోగోను ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న విధంగానే ఈ ఏడాది కూడా వినాయక ఉత్సవాలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై సభ్యులు చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మదర్ తెరిసా యూత్ సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లిలో ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలి





- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 10, (ప్రజా జ్యోతి)** చుంచుపల్లిలో విజయ డెయిరీ కోసం స్థలం కేటాయించినందున ఆ స్థలంలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు లక్ష్మీదేవిపల్లిలోని ప్రస్తుత విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఉన్న స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నందున, కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందులో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించి, కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే అంశంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రతిరోజూ జరుగుతున్న పాల సేకరణ, శీతలీకరణ ప్రక్రియ, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, పరికరాల పనితీరు తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం పరిధిలో సుమారు 30 గ్రామాలకు చెందిన 400 మంది రైతులు పాల సేకరణకు అనుసంధానమై ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 500 లీటర్ల వరకు పాలు సేకరిస్తుండగా, పాల ఉత్పత్తి అధికంగా ఉండే సీజన్‌లో రోజువారీ సేకరణ సుమారు 4, వేల లీటర్ల వరకు పెరుగుతుందని వివరించారు. ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో పాలను సేకరించి ఖమ్మం డెయిరీకి తరలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ కేంద్రంలోని కూలింగ్ ట్యాంక్, స్టోరేజ్ వ్యవస్థ, కంప్రెసర్ తదితర పరికరాలను పరిశీలించారు. ప్రస్తుత భవనం, పరికరాల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అం శంపై అధికారులతో చర్చించారు. చుంచుపల్లిలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే స్థలాన్ని గుర్తించి, విజయ డెయిరీ అధికారులకు సూచించినందున, కేంద్రం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను త్వరితగతిన చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. రైతులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, పాల సేకరణ , శీతలీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, అదే సమయంలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లిలో ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు కూడా ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ పరిశీలనలో లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, విజయ డెయిరీ మేనేజర్ సౌజన్య, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రులను జరుపుకోవాలి

- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు:డీఎస్పీ



**ఇల్లందు, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)** ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రులను జరుపుకోవాలని ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు సూచించారు. ఇల్లందు పోలీస్ స్టేషన్ లో గురువారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీష్ గణేష్ మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ నుండి అనుమతి తీసుకోవాలని, అదేవిధంగా విద్యుత్ సరఫరా కోసం అనుమతులు పొందాలని కోరారు. ప్రతి గణేష్ మండపం వద్ద వాలంటీర్లను నియమించుకోవాలని, సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సౌండ్ సిస్టం ఏర్పాటులో నిబంధనలు పాటించాలని, రాత్రి 10 గంటల తర్వాత డీజేలు, అధిక శబ్దంతో లోడ్ స్పీకర్లకు అనుమతి లేదని హెచ్చరించారు. మత సోమరస్యానికి భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించవద్దని సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వినాయక విగ్రహాల శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. గణేష్ శోభాయాత్రకు పోలీసులు కేటాయించిన మార్గంలోనే వెళ్లాల ని, మద్యం సేవించి ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, పాత కక్షలకు గణేష్ నిమజ్జనం వేడుకలను వేదికలుగా మార్చుకోవద్దని సూచించారు. ఈ సమావేశంలో సీఐ తాటిపాముల సురేష్, ఎస్ఐ ఉమ, పోలీస్ సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మొండికుంట అడవుల్లో కోడి పందాలపై దాడులు

- కోడిపందాల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి
- 14 మోటార్‌సైకిళ్లు, రూ.41,820 నగదు స్వాధీనం
- ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో తనిఖీలు



**అశ్వాపురం, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:** మండలంలోని మొండికుంట సమీప అటవీ ప్రాంతంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు.ఈ దాడుల్లో 14 మోటార్ సైకిళ్లు, రూ.41,820 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసుల రాకను గమనించిన కొందరు అక్కడి నుంచి తప్పించుకున్నట్లు తెలుస్తోంది. కోడిపందాల నిర్వహణలో ఎవరి పాత్ర ఉంది, నగదు లావాదేవీలు ఎలా జరిగాయి అనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.అటవీ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని ఇలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండా నిరంతరం నిఘా కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

## ఐలమ్మ స్ఫూర్తితో భూ పోరాటాలను ఉధృతం చేద్దాం

- సీపీఎం పాల్వంచ పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు కె. సత్య పిలుపు

**పాల్వంచ, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:** వీర తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ చూపిన తెగువ, ధైర్యం, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని భూ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని సీపీఎం పాల్వంచ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు కె. సత్య పిలుపునిచ్చారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కె. సత్య మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ వీర తెలంగాణకు నిప్పుకణికలాంటిదని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ చూపిన తెగువ, ధైర్యం ఆనాటి ఉద్యమానికి గొప్ప స్ఫూర్తినిచ్చాయని అన్నారు. విసునూరు దేశ్‌ముఖ్‌తో పాటు అప్పటి దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తన భూమిలో పండించిన పంటను నైజాం మూకలు బలవంతంగా ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించడాన్ని వ్యతిరేకిస్తూ, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ అండతో తన పంటను కాపాడుకునేందుకు ఐలమ్మ చేసిన పోరాటం ప్రజల్లో నూతన స్ఫూర్తిని నింపిందని తెలిపారు. తనను, తన కుటుంబ సభ్యులను నైజాం మూకలు చిత్రహింసలకు గురిచేసినా ఐలమ్మ ఏమాత్రం భయపడకుండా ధైర్యంగా ఎదురొడ్డి నిలిచారని అన్నారు. ఐలమ్మ తన పంట కోసం సాగించిన పోరాటం అనంతరం జరిగిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఎంతోమంది కౌలు రైతులు, పేద రైతులు నైజాం నవాబు అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమంలోకి వచ్చారని కె. సత్య తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో భవిష్యత్తులో పేదలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై ఐక్యంగా పోరాటాలను మరింత ఉధృతం చేయాలని కె. సత్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ కమిటీ సభ్యులు బి. కాంతి, బి. మాధవి, శాఖ కార్యదర్శి బి. సత్యమ్మ, ఇందిర, అరుణ, లక్ష్మీకుమారి, పద్మ పాల్గొన్నారు.



## బీజాపూర్‌లో భారీగా పేలుడు సామగ్రి స్వాధీనం





**చర్ల , సెప్టెంబర్ 10:(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో కొనసాగుతున్న నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భద్రతా దళాలకు భారీ విజయం లభించింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన గాలింపు చర్యల్లో మావోయిస్టులు దాచిన పేలుడు సామగ్రి, గ్రెనేడ్లు, బీజీఎల్‌కు సంబంధించిన భాగాలు, డిటోనేటర్లు తదితర సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.పోలీసుల వివరాల ప్రకారం సెప్టెంబర్ 9న సీఆర్పీఎఫ్ 196వ బెటాలియన్‌కు చెందిన సిబ్బంది తాడ్‌పాల్ ఎఫ్‌ఓబీ పరిధిలోని కొండ ప్రాంతంలో విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా రాళ్ల కింద, భూగర్భంలో దాచి ఉంచిన అనుమానాస్పద సామగ్రిని గుర్తించారు. ఇందులో బీజీఎల్ రౌండ్ కాంపోనెంట్లు, బీజీఎల్ నోస్, ఇనుప పైపులు, అల్యూమినియం పాత్ర, లేత్ మెషిన్ హ్యాండిల్ తదితర సామగ్రి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిని సీజ్ చేసి తదుపరి చర్యలు చేపట్టారు.అంతకుముందు సెప్టెంబర్ 5న డీఆర్జీ, మిర్తూర్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కూడిన సంయుక్త బృందం ఇంద్రిపాల్ అటవీ ప్రాంతంలో గాలింపు నిర్వహించింది. ఈ సందర్భంగా మావోయిస్టులు దాచిన డంప్‌ను గుర్తించి సోదాలు చేయగా గ్రెనేడ్లు, బాణం బాంబులు తదితర పేలుడు సామగ్రి లభించింది. పేలుడు సామగ్రి లభించడంతో భద్రతా చర్యల్లో భాగంగా బాంబు డిస్పోజల్ స్క్వాడ్ (బీడీఎస్)ను సంఘటనా స్థలానికి రప్పించారు. నిబంధనలు, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ బీడీఎస్ బృందం పేలుడు సామగ్రిని అక్కడికక్కడే సురక్షితంగా నిర్వీర్యం చేసింది. భద్రతా దళాల అప్రమత్తతతో ప్రమాదం తప్పింది అని అధికారులు తెలిపారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**భద్రాచలం సెప్టెంబర్ 10,(ప్రజా జ్యోతి)** ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ ఆధ్వర్యంలో నేడు శుక్రవారం భద్రాచలంలోని పాత ఎల్ఐసి ఆఫీసు ఎదురుగా ఉన్న ఆల్ పెన్షన ర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వరంగల్లు శరత్ మాక్సివిజన్ కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించనున్నట్లు ఆల్ పెన్షనర్స్ డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు తెలిపారు . ఆయన మాట్లాడుతూ ఈ కంటి పరీక్షలలో క్యాటరాక్ట్ కలిగి ఉన్నటువంటి వారిని వారి సొంత వాహనాలలో వరంగల్ తీసుకు వెళ్లి ఆపరేషన్ చేసి రవాణా సౌకర్యము. వసతి సౌకర్యము. ఉచితంగా మందులు అందించడంతోపాటు భోజన వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు, ఆపరేషన్ అయిన తర్వాత తిరిగి వారి వాహనాలలో తీసుకువచ్చి ఆఫీసు వద్ద దించుతారని తెలిపారు, కంటి పరీక్షా శిబిరానికి వచ్చేటప్పుడు తప్పనిసరిగా హెల్త్ కార్డు తీసుకురావాలని కోరారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సుబ్బయ్య చౌదరి ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎల్ వి ప్రసాద్. సలహాదారు మాదిరెడ్డి రామ్మోహనరావు. కోశాధికారి. డి కృష్ణమూర్తి. సీనియర్ ఉపాధ్యక్షులు ముగడ హరినాథ్. ఎస్ రాజబా బు. విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం. . గొ ర్సా మురళీకృష్ణ. టీ దాసు.చుక్క రాం బాబు. కన్నయ్య లాల్..సూరిశెట్టి కృష్ణ. శ్యాంసుందర్రావు. పురుషోత్తం. బన్సీ లాల్. జగన్మోహనరావు, శివప్రసాద్. ఐ. వి. వి. సత్యనారాయణ, బందు వెంకటేశ్వర రావు , కేఎస్ఎల్వీ ప్రసాద్ , డి కృష్ణమూర్తి నువ్వు పర్యవేక్షిస్తారని తెలిపారు.

## పాల్వంచ–కొత్తగూడెం వేదికగా ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ టోర్నమెంట్

- సెప్టెంబర్ 16 నుంచి 22 వరకు పోటీలు
- దేశవ్యాప్తంగా 300–400 మంది క్రీడాకారుల రాక
- 35+ నుంచి 75+ వరకు ఆరు విభాగాల్లో పోటీలు



**పాల్వంచ, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ–కొత్తగూడెం జంట నగరాలు తొలిసారిగా ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌కు వేదిక కానున్నాయి. సెప్టెంబర్ 16 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ జాతీయస్థాయి పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 300 నుంచి 400 మంది సీనియర్ క్రీడాకారులు హాజరుకానున్నట్లు జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.గురువారం పాల్వంచలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, శ్యామల గోపాలం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ నల్ల సురేష్‌రెడ్డి సహకారంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**ఆరు విభాగాల్లో పోటీలు....**

సీనియర్ క్రీడాకారుల కోసం 35+, 45+, 55+, 65+, 70+, 75+ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు తరలిరానుండటంతో పోటీలు ఉత్కంఠభరితంగా సాగనున్నాయని పేర్కొన్నారు.

**పలు వేదికల్లో మ్యాచ్‌లు....**

టోర్నమెంట్‌లో భాగంగా పాల్వంచ–కొత్తగూడెం ప్రాంతంలోని పలు టెన్నిస్ కోర్టుల్లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. పాల్వంచ మినీ స్టేడియం, శ్రీనివాస్ కాలనీ, కేటీపీఎస్ కాంప్లెక్స్, నవభారత్ కాలనీ, కొత్తగూడెం ప్రగతి మైదానం, సింగరేణి కాలరీస్ టెన్నిస్ కోర్టుల్లో పోటీలు జరగనున్నట్లు తెలిపారు.

**జంట నగరాలకు క్రీడా రంగంలో గుర్తింపు ....**

జాతీయస్థాయి టెన్నిస్ పోటీలకు పాల్వంచ–కొత్తగూడెం జంట నగరాలు వేదిక కావడం ఈ ప్రాంత క్రీడా చరిత్రలో ప్రత్యేక ఘట్టమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జాతీయ స్థాయిలో క్రీడా రంగంలో మరింత గుర్తింపు లభించే అవకాశం ఉందన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. క్రీడాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జాతీయ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు.విలేకరుల సమావేశంలో జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి, సెక్రటరీ జాకరయ్య, వైస్ ప్రెసిడెంట్ వై. వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ అన్నం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ఆత్మహత్యల నివారణపై అవగాహన పెంచాలి

- సమస్యలను మనసులో దాచుకోకుండా విశ్వసనీయులతో పంచుకోవాలి
- టెలి-మానస్ హెల్ప్‌లైన్ 14416ను వినియోగించుకోవాలి: డీఎంహెచ్‌వో డా. తుకారామ్ రాథోడ్





**పాల్వంచ, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:** ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పాల్వంచలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేఎల్ఆర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. తుకారామ్ రాథోడ్ పాల్గొని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఆత్మహత్యల నివారణ, మానసిక ఆరోగ్యం, ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆత్మహత్యా ఆలోచనలు, మానసిక ఒత్తిడి, నిరాశ, భావోద్వేగ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. సమస్యలను మనసులోనే దాచుకోకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా విశ్వసనీయ వ్యక్తులతో మాట్లాడాలని సూచించారు.విద్యార్థులు, యువత మంచి పుస్తకాలు చదవడం, సానుకూల ఆలోచనలను పెంపొందించుకోవడం, సృజనాత్మక, ఆరోగ్యకరమైన కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. సమస్యలు తీవ్రంగా అనిపించినప్పుడు ఒంటరిగా ఎదుర్కోకుండా కౌన్సిలర్లు, మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు.ఎవరైనా ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనలు లేదా తీవ్రమైన మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్లు గుర్తిస్తే వారిని నిర్లక్ష్యం చేయకుండా వారితో మాట డి మద్దతుగా నిలవాలని, అవసరమైన సమయంలో నిపుణుల సహాయం అందేలా చూడాలని కోరారు.

**టెలి–మానస్ 14416ను వినియోగించుకోవాలి**

ఆత్మహత్యా ఆలోచనలు, మానసిక ఒత్తిడి, ఆందోళన లేదా ఇతర మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు టెలి–మానస్ హెల్ప్‌లైన్ 14416కు ఫోన్ చేసి అవసరమైన సహాయం, మార్గదర్శకత్వం పొందవచ్చని డీఎంహెచ్‌వో తెలిపారు.

**పోషకాహారంతో ఆరోగ్యకరమైన జీవనం**

కొనసాగుతున్న పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా సమతుల్య ఆహారం, పోషకాహారం ప్రాముఖ్యతను కూడా డా. తుకారామ్ రాథోడ్ వివరించారు. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ప్రోటీన్లు, అవసరమైన విటమిన్లు, ఖనిజాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు.శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలోనూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

**మంగపేట పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ**


అనంతరం డీఎంహెచ్‌వో డా. తుకారామ్ రాథోడ్ మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలు, సిబ్బంది అందుబాటు, వైద్య చికిత్స, మందుల సరఫరా తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.రోగులకు ఎలాంటి ఆలస్యం లేకుండా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స, తగిన మార్గదర్శకత్వం అందించాలని వైద్యాధికారి, సిబ్బందికి సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఆరోగ్య శాఖ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.

**సబ్ సెంటర్లలో శ్రమదానం తప్పనిసరి**

అన్ని సబ్ సెంటర్ల స్థాయిలో శ్రమదానం కార్యక్రమాలను నిర్వహించి ఆరోగ్య కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. పరిసరాల్లో చెత్తాచెదారం, నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకోవాలని, సిబ్బంది సమన్వయంతో క్రమం తప్పకుండా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ప్రతి ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతతో పాటు నాణ్యమైన రోగి సేవలు, సమయానుకూల వైద్యం, ప్రజలకు సత్వర స్పందన ఉండేలా సిబ్బంది కృషి చేయాలని డా. తుకారామ్ రాథోడ్ ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ సేకరణ పనులు,సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్






**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 10 ,(ప్రజా జ్యోతి)** భూ సేకరణ పనులు,సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.ఐ.డీ.ఓ.సీ లోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట్ ,జిల్లాలోని తహసీల్దార్, ఇరిగేషన్, సంబంధిత సెక్షన్ అధికారులు, సర్వేయర్లలతో జిల్లా కలెక్టర్ అంకిత్ వీడియో కాన్ఫిరెన్స్ గురువారం నిర్వహించారు.సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, సీతమ్మ సాగర్ ప్రాజెక్టు, పులుసు బొంత ప్రాజెక్టులు, బీ.టీ.పీ.ఎస్ ల భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని తాహసిల్దార్లను, సర్వేయర్లను ఆదేశించారు. నిర్దేశించిన సమయాలోపు పనులు పూర్తి చేసేలా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు.ఎప్పటికప్పుడు పెండింగ్లో ఉన్న పనులను మానిటరింగ్ చేస్తూ సమస్యలు పరిష్కరించేలా తాహసిల్దారులతో మాట్లాడాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్ కు జిల్లా కలెక్టర్ సూచించారు.జిల్లాలో అన్నీ మండలాల్లో కొనసాగుతున్న భూభారతి రీ – సర్వే,సాదా బైనమా,రెవిన్యూ సదస్సులు క్యాంప్ మోడో లో జరిపించాలని , సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు, ఐ.కే.పీ సర్వేయర్లు ఈ రీ – సర్వే ప్రక్రియను ను సీరియస్ గా తీసుకొవాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లాలో ఉన్న అన్నీ మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు రీ – సర్వే ను సకాలంలో పూర్తి చేసేలా ప్రతిరోజు ప్రణాళిక బద్ధంగా సర్వే చేసి,ఆ రికార్డులను నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. అనంతరం ప్రతి మండల తాహసిల్దార్లు, సర్వేయర్లతో వారు చేస్తున్న సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంత సర్వే చేశారని,ఆ సర్వే వివరాలు రికార్డును సకాలంలో పూర్తి చేయాలని తెలియజేసారు.యుద్ధ ప్రాతిపదికన సర్వే పూర్తిచేసేలా తాహసిల్దార్లు, సర్వేయర్లు బాధ్యతతో పనిచేసే సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూభారతి దరఖాస్తులు ప్రతి మండల తాసిల్దార్లు, ఆర్డీవోలు, సబ్ కలెక్టర్ లాగిన్ లో పెండింగ్లో ఉన్నాయని వాటిని తక్షణమే పరిశీలించి పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "సర్" కార్యక్రమంలో ఓటర్లు వద్ద నుంచి ఓటు నమోదుకు సరైన ధ్రువపత్రాలు కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని ఏ.ఆర్.ఓ.ఎస్, ఏ.ఈ. ఆర్.ఓ.ఎస్ బాధ్యత తీసుకొని పనిచేయాలన్నారు.

# శిరీషకు కన్నీటి నివాళి

- కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే జారే
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి: మాజీ ఎమ్మెల్యే తాటి
- మృతిపై పలు అనుమానాలున్నాయి: మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య
- న్యాయం జరిగే వరకు పోరాటం: చుంచు రామకృష్ణ









**ములకలపల్లి, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):** హైదరాబాద్ లోని ప్రైమ్ కేర్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ దారుణ హత్యకు గురైన ఊకే శిరీష దశదినకర్మ కార్యక్రమం, సంతాప సభ మండలంలోని చౌటిగూడెం గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, గుమ్మడి నర్సయ్య, జనసేన రాష్ట్ర నాయకుడు, సినీ హీరో తనీష్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు హాజరై శిరీష చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది**

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. శిరీష కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి అందజేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఘటనపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని, దోషిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శిరీష పేరు నిలిచిపోయేలా ఆమె పేరుతో గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ తో పాటు కమ్యూనిటీ హాల్, కంపగూడెం క్రాస్ రోడ్డులో బస్ స్టాండ్ వంటి నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి**

అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. శిరీష హత్య జరిగి 14 రోజులు గడిచినా బాధిత కుటుంబానికి ఆశించిన స్థాయిలో న్యాయం అందకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణను వేగవంతం చేసి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**మృతిపై పలు అనుమానాలు**

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. శిరీష మృతిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఆసుపత్రి యాజమాన్యం పాత్రపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

**న్యాయం జరిగే వరకు పోరాటం**

జనసేన రాష్ట్ర నాయకుడు, సినీ నటుడు అల్లాడి తనీష్ మాట్లాడుతూ.. శిరీష కుటుంబానికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే జనసేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**పాదయాత్రతో న్యాయ పోరాటం**

ఆదివాసీ 9 తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ మాట్లాడుతూ.. శిరీష కుటుంబానికి అండగా నిలిచి న్యాయం కోసం పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల నుంచి చదువు, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ఆడపిల్లలకు భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**రూ.కోటి ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి**

ఆదివాసీ నాయకులు సోయం వీరభద్రం, వాసం రామకృష్ణ మాట్లాడుతూ.. శిరీష కుటుంబానికి రూ.కోటి ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారంతో సరిపెట్టడం సరికాదని విమర్శించారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సంతాప సభలో దమ్మపేట మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వర్లు, ములకలపల్లి మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సీతారామ సబ్ కెనాల్ భూసేకరణపై రైతుల అభ్యంతరం

- ఎకరాకు రూ.25 లక్షలు ఇస్తేనే భూములు ఇస్తాం
- రెండు పంటలు పండే భూములు కోల్పోతున్నామని రైతుల ఆవేదన



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 10, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల నర్సాపురం (రాజపురం) గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీతారామ సబ్ కెనాల్ భూసేకరణపై గ్రామ సభ నిర్వహించారు. సీతారామ భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ వెంకట్రావు, తహసిల్దార్ స్వర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో భూసేకరణకు సంబంధించి రైతుల అభిప్రాయాలు, అభ్యంతరాలను అధికారులు తెలుసుకున్నారు. భూసేకరణపై ఏవైనా సందేహాలు, అనుమానాలు ఉంటే సభ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా సబ్ కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు భీమిరెడ్డి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు తమ అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో రెండు పంటలు పండే సాగు భూములు ఉన్నాయని, సీతారామ సబ్ కెనాల్ నిర్మాణంతో విలువైన భూములను కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములకు ఎకరాకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లిస్తేనే భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, లేదంటే భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లతో ఉప కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బన్నె ఏసుబాబు, దుబాకుల రాము, గణపతిరెడ్డి, భీమిరెడ్డి కృష్ణారెడ్డి, ఉప్పరి అశోక్, వెంకటరెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

# ఎన్ ఎస్ యు ఐ కొత్తగూడెం జిల్లా అధ్యక్షునిగా రెండోసారి అజ్మీర సురేష్ నాయక్ నియామకం

- రాష్ట్ర అధ్యక్షులు ఎడవల్లి వెంకటస్వామి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్న సురేష్ నాయక్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 10 ,(ప్రజా జ్యోతి)** నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా ( ఎన్ ఎస్ యు ఐ ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా అజ్మీర సురేష్ నాయక్ వరుసగా రెండోసారి నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామి చేతుల మీదుగా అజ్మీర సురేష్ నాయక్ నియామక పత్రాన్ని అందుకున్నారు, విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం, విద్యార్థుల హక్కుల కోసం చేపట్టిన ఉద్యమాలు, జిల్లాలో ఎన్ ఎస్ యు ఐ ని బలోపేతం చేయడంలో చూపిన చురుకైన పాత్రను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం మరోసారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష బాధ్యతలను అజ్మీర సురేష్ కు అప్పగించారు, ఈ సందర్భంగా సురేష్ నాయక్ మాట్లాడుతూ“ఒక్కసారి పదవి రావడం గౌరవం అయితే.. వరుసగా రెండోసారి అదే బాధ్యత దక్కడం నాపై ఉంచిన నమ్మకానికి నిదర్శనం” అని అజ్మీర సురేష్‌నాయక్ పేర్కొన్నారు.

రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లాలో విద్యార్థి సమస్యలపై మరింత బలంగా, మరింత పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు, విద్యార్థులకు అన్యాయం జరిగిన ప్రతి సందర్భంలో ఎన్ ఎస్ యు ఐ ముందుండి ప్రశ్నిస్తుందని, విద్యార్థుల హక్కుల కోసం అవసరమైతే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని తెలిపారు.నాపై నమ్మకంతో రెండోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క , రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జాకర్ , రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామి లకు కృతజ్ఞతలు.

# మణుగూరులో ఎస్సీసీఎల్ పర్యావరణ కార్యక్రమాలపై సమీక్ష

- సింగరేణి ఏరియాలో జాతుల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత
- బొగ్గు గనుల భూముల్లో వ్యవసాయం
- సింగరేణి కొత్త ప్రయోగం - ఎమ్ఎన్జీఓసీపీను సందర్శించిన సలహాదారు
- గ్రీన్ బెల్ట్ ను మరింత విస్తరించాలి - ఎస్సీసీఎల్ పర్యావరణ సలహాదారు ఎన్.సి. పర్దేయి అధికారులకు దిశానిర్దేశం





**మణుగూరు సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి ):** మణుగూరు సింగరేణి కాలరీస్ కంపెనీలో పర్యావరణం, అటవీ వ్యవహారాల సలహాదారు శ్రీ ఎన్.సి. పర్దేయి, గురువారం మణుగూరు ఏరియాలో పర్యటించారు. ఆయన మణుగూరు ఏరియాలో చేపడుతున్న మొక్కల పెంపకం, గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే మణుగూరు ఏరియాకు సంబంధించిన నూతన ప్రతిపాదనల ప్రాసెసింగ్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మరియు వివిధ విభాగాల ఉన్నతాధికారులు ఇల్లందు గెస్ట్ హౌస్ వద్ద ఎన్.సి. పర్దేయికి స్వాగతం పలికారు.అనంతరం ఆయన మణుగూరు ఏరియా నర్సరీని సందర్శించి అక్కడ పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఏరియా అవసరాలకు అనుగుణంగా మరింత అధిక సంఖ్యలో మొక్కలను పెంచాలని సూచించారు. స్థానిక వాతావరణం, నేల పరిస్థితులకు అనుకూలంగా ఉండే స్వదేశీ వృక్ష జాతులను అధికంగా పెంచాలని అధికారులకు సూచించారు. స్థానిక జాతుల మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు జీవవైవిధ్యాన్ని కూడా కాపాడేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.అనంతరం ఆయన మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ను సందర్శించి అక్కడ సింగరేణి చేపడుతున్న వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించారు. గనుల కార్యకలాపాల అనంతరం ప్రభావితమైన ప్రాంతాలను పునరుద్ధరించి, ప్రత్యామ్నాయ వినియోగాలకు మళ్లించే కార్యక్రమంలో భాగంగా సింగరేణి చేపడుతున్న వ్యవసాయాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

## భద్రాద్రిలో ల్యాబ్ ల తనిఖీలు

- మణుగూరు,అశ్వాపురంలో ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లపై అధికారుల దాడులు
- నిబంధనలు పాటించని సెంటర్లకు నోటీసులు
- డీఎమ్హెచ్ఓ ఆదేశాలతో రికార్డులు,రిజిస్ట్రేషన్ ల పరిశీలన
- క్లినికల్ యాక్ట్ అమలు కావాలని అధికారులు ఆదేశం









**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి,మణుగూరు,అశ్వాపురం ప్రజాజ్యోతి** జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డీఎమ్హెచ్ఓఆదేశాల మేరకు జిల్లాలోని మణుగూరు, అశ్వాపురం మండలాల్లో ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లపై అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా డయాగ్నొస్టిక్ సెంటర్లలో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లు, ఇతర సంబంధిత పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్స్ యాక్ట్ కు సంబంధించిన అనుమతులు, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయా లేదా, నిబంధనలు సరిగా అమలు చేస్తున్నారా అనే అంశాలను తనిఖీ చేశారు. తనిఖీలలో గుర్తించిన లోపాలను సంబంధిత నిర్వాహకులకు తెలియజేసి, వెంటనే నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. నిబంధనలు పాటించని, లోపాలు గుర్తించిన డయాగ్నొస్టిక్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. తనిఖీలకు సంబంధించిన సమగ్ర నివేదికను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి సమర్పించారు.ఈ తనిఖీల కార్యక్రమంలో క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాందాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

# సివిల్ సప్లైస్ లో ‘అవినీతి తిమింగలం’?



- ఉమ్మడి ఖమ్మం జిల్లానే అడ్డాగా అక్రమ సంపాదన?
- పదేళ్ల సర్వీసులో కోట్ల ఆస్తులా..? విచారణకు సిద్ధమా?
- ఖమ్మం–కొత్తగూడెం–అశ్వరావుపేట కేంద్రంగా ఆరోపణలు

**అశ్వరావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 10**

సివిల్ సప్లైస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిపై తీవ్రస్థాయిలో అవినీతి, అక్రమ ఆస్తుల ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు ఉద్యోగి ఎక్కడ విధులు నిర్వహించినా అక్కడ భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. సదరు ఉద్యోగికి సుమారు రూ.10కోట్లకు పైగా అక్రమ ఆస్తులు ఉన్నాయనే సమాచారం వెలువడుతున్న నేపథ్యంలో ఈ ఆస్తుల మూలాలు ఏమిటన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఖమ్మం, కొత్తగూడెం, అశ్వరావుపేట ప్రాంతాల్లో ఆస్తులు కూడబెట్టినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఎక్కడ పోస్టింగ్.. అక్కడే వసూళ్ల ఆరోపణలు?

సదరు ఉద్యోగి ఏ ప్రాంతంలో విధులు నిర్వహించినా అక్కడ వ్యాపారులు, సంబంధిత వర్గాల నుంచి లక్షల రూపాయల్లో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలు, ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆదాయానికి మించిన ఆస్తుల వివరాలు బయటకు వస్తేనే ఆరోపణల తీవ్రత ఎంత అన్నది తేలనుంది.

### గతంలో సస్పెన్షన్ కు గురయ్యారా?

సదరు ఉద్యోగి గతంలో విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యానికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఒకసారి సస్పెన్షన్ కు గురైనట్లు సమాచారం. అది నిజమే అయితే ఏ కారణంతో సస్పెండ్ చేశారు? ఎలాంటి శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు? అనంతరం తిరిగి విధుల్లోకి ఎలా వచ్చారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### రూ.10 కోట్ల ఆస్తుల వెనుక ఆదాయ మార్గమేంటి?

ప్రభుత్వ ఉద్యోగి వేతనం, ఇతర చట్టబద్ధ ఆదాయ వనరులతో పోలిస్తే ఇంత భారీ స్థాయిలో ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలు నిజమైతే అవి ఎలా సమకూరాయి అన్నది తేలాల్సి ఉంది. ఆస్తులు నిజంగా రూ.10కోట్లకు పైగా ఉన్నాయా?<ఆ ఆస్తులు ఉద్యోగి పేరునా? కుటుంబ సభ్యుల పేరునా? బినామీ పేర్లతో పెట్టుబడులు ఉన్నాయా? ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు అవకాశం ఉందా? ఇవన్నీ సంబంధిత దర్యాప్తు సంస్థలు పరిశీలించాల్సిన అంశాలే.

### అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందిస్తారా?

సివిల్ సప్లైస్ శాఖ ప్రజలకు నిత్యావసర వస్తువుల సరఫరా, ధరల పర్యవేక్షణతో పాటు అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ వంటి అంశాలపై చర్యలు తీసుకోవాల్సిన శాఖ. అలాంటి శాఖలో పని చేస్తున్న ఉద్యోగిపైనే ఇంత పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తే ఉన్నతాధికారులు మౌనం వహించడం సరికాదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు.. అసత్యమైతే ఆరోపణలకు ఆధారాలేమిటో బహిర్గతం చేయాలి.ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది

### ప్రజా జ్యోతి తదుపరి కథనంలో..

సదరు ఉద్యోగికి సంబంధించినట్లు ఆరోపణలు వస్తున్న ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి? వాటి విలువ ఎంత? ఏ పేర్లపై ఉన్నాయి? అనే అంశాలపై అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా తదుపరి కథనాలను ప్రచురించనున్నాం.

## శక్తి వద్దు - పాలిటెక్నిక్ నే కాపాడండి..!

- మణుగూరులో విద్యార్థుల పోస్టుకార్డు నిరసన...
- హైకోర్టు చీఫ్ జస్టిస్ కు పోస్టుకార్డులు రాసిన పాలిటెక్నిక్ విద్యార్థులు...






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /మణుగూరు సెప్టెంబర్ 10,ప్రజాజ్యోతి...** మణుగూరులోని గవర్నమెంట్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు గురువారం తమ భవిష్యత్తు కోసం వినూత్న నిరసనకు దిగారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి పరిధిలోకి తీసుకురావద్దంటూ హైకోర్టు చీఫ్ జస్టిస్ కు పోస్టుకార్డుల ద్వారా తమ గోడును వినిపించారు.ఈ సందర్భంగా విద్యార్థులు "శక్తి వద్దు – పాలిటెక్నిక్ విద్యను కాపాడండి", అంటు "ఏఐసీటీఈ–ఎస్బీఈటీటీ వ్యవస్థను కొనసాగించాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కళాశాల నుండి ర్యాలీ నిర్వహించారు. తమ డిప్లొమా విద్యకు ఉన్న గుర్తింపు, ఉన్నత విద్యకు వెళ్లే అవకాశాలు, స్కాలర్ షిప్ లు, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి అంశాలపై శక్తి ప్రభావం పడుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ఉన్న ఏఐసీటీఈ–ఎస్బీఈటీటీ విధానాన్ని యథాతథంగా కొనసాగిస్తూ విద్యార్థుల విద్యా ప్రయోజనాలను, భవిష్యత్తును కాపాడాలని వారు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు, న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టినట్లు విద్యార్థులు తెలిపారు.